క్లుప్తంగా

వైద్యులకు డైరీల పంపిణీ



వైద్యురాలికి డైరీ అందిస్తున్న సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రముఖ వైద్యులకు ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, చల్లగుళ్ల స్పందన, మోహన్‌రావు, భరణి బాబు, ఎల్‌జీబీవీఎస్ చారి, విష్ణు, సుభద్ర, క్రాంతికుమార్, బందు వెంకటేశ్వర్లు, చల్లగుళ్ల నాగేశ్వరరావు, ప్రసాద్, కృష్ణమూర్తి, రాజబాబు, సుధాకర్‌రెడ్డి, రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కథగా ఎంపిక



నాగదినేశ్

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థి చాపా నాగదినేశ్ రాసిన కథ 'ఆరోగ్యం'.. ఉత్తమ కథగా ఎంపికైంది. బాల సాహిత్య పీఠం – 2023 పేరుతో మాచిరాజు సీతారామయ్య నిర్వహించిన కథల పోటీలకు మొత్తం 45 కథలు రాగా, వాటిలో 22 కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేశారు. చాపా నాగదినేశ్ రాసిన కథ కూడా ఆ జాబితాలో చోటుదక్కించుకుంది. విద్యార్థిని హెచ్‌ఎం సరళ, ఉపాధ్యాయులు సునంద, తదితరులు అభినందించారు.

కిష్టారంపాడులో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దివ్యనయన

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని కిష్టారంపాడు ఆదివాసీ గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఉన్న గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారిణి దివ్యనయన అవగాహన కల్పించారు. శిబిరంలో డీపీఎంఓ చింతా సత్యనారాయణ, ఎంఎల్ హెచ్‌పీ దీప్తిమౌనిక, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ఉపాధ్యాయులు

చండ్రుగొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఉండేటి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు డి.నర్సింహారావు, శకుంతల, ఉమారాణిని విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదో తరగతి విద్యార్థులకు తోటి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణకుమారి, మంజూశ్రీ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కరకగూడెం: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడి కట్టుకున్నారు. గురుస్వామి చందా మధు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య మాలధారులు శబరిమలై బయలుదేరారు.

ఎన్‌ఓసీ ఇవ్వాలి

భద్రాచలంటౌన్: ఉన్నత విద్యాభ్యాసం కోసం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్‌ఓసీ) ఇవ్వాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యాశాఖాధికారులను బుధవారం కోరారు. స్పందించిన విద్యా శాఖ అధికారులు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు త్వరగా ఎన్‌ఓసీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు తెలిపారు. ప్రసాద్‌రావు, రామాచారి పాల్గొన్నారు.

సమస్యల చట్రంలో మణుగూరు

- మున్సిపాలిటీలో ఎక్కడికక్కడే చెత్తాచెదారం
- పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- రహదారులు, కాలనీల్లో దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు



మున్సిపాలిటీలోని ఓ వీధిలో సైడ్ డ్రెయినేజీ అంతా మురుగునీటితో నిండిన దృశ్యం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోయాయి. అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. డ్రెయినేజీలు పూడుకుపోయాయి. పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు డంప్‌గా మారిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, శేషగిరినగర్, ఆదర్శనగర్, కమలాపురం, అన్నారం, చినరాయిగూడెం, సుందరయ్యనగర్, శ్రీశ్రీనగర్ ప్రాంతాల్లో రోడ్లపై చెత్త చెదారం పేరుకుపోతోంది. దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దోమలు పెరిగిపోవడంతో అస్వస్థతకు గురవుతున్నారు. చెత్త చెదారంతో నిండిన పలు ప్రాంతాల్లో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయినా అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఎవరైనా విజ్ఞప్తులు, వినతులు సమర్పించినా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్న అధికారులు పారిశుధ్యం విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ చెత్త ఎత్తడంలో లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిత్యం పారిశుద్ధ్య పనులు చేయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్తాచెదారంతో ప్రధాన రహదారులు

మున్సిపాలిటిలోని భగత్‌సింగ్‌నగర్, సుందరయ్యనగర్, ఆదర్శనగర్‌లోని సీసీ రోడ్లపై చెత్త విపరీతంగా పేరుకుంది. మున్సిపాలిటీ అధికారులు నామమాత్రంగా తమ విధులను నిర్వర్తిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీలో పన్ను వసూలు చేసేందుకు వెళ్లిన సిబ్బందితో ప్రజలు వాగ్వాదానికి దిగుతున్నారు. కాగా, ఈ విషయమై మణుగూరు మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.



సురక్షా బస్టాండ్ ప్రాంతంలో చెత్త కుప్ప

రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలి



మున్సిపాలిటీ రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలి. కాలనీల్లో చెత్త పేరుకుపోవడంతో అక్కడికి పలురకాల జంతువులు వచ్చి చిందరవందర చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలి. మున్సిపాలిటీ అధికారులు పన్నులే కాకుండా ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి. అలాగే, అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–ప్రేమ్‌దాస్, మణుగూరు

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సైడ్ డ్రెయిన్లు బురద నీటితో దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీల వెంట తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. అంతేకాకుండా డ్రెయినేజీల్లో మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురవుతున్నారు. మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

–వెంకన్న, మణుగూరు

దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరురూరల్: 2024 – 25 ఏడాదికి గాను మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల, సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మణుగూరు పాఠశాల ప్రిన్సిపాల్ రేవతిదేవి బుధవారం తెలిపారు. నాలుగో తరగతి విద్యార్థులు రూ.100 రుసుంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని వివరించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

భద్రాచలంటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో డిగ్రీలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు భద్రాచలం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో సర్వే నంబర్–1లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ డివిజన్ కార్యదర్శి సొందె మల్లూరు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆక్రమణపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రేసు ఆదినారాయణమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సీనియర్ నాయకులు పిసోడి మారయ్య, సోయం సత్తిబాబు, పూనెం శరత్‌బాబు, మడకం సమ్మక్క, తాటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పేట' ఎమ్మెల్యే పర్యటన



దమ్మపేట: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట/అన్నపురెడ్డిపల్లి: స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. బుధవారం దమ్మపేట మండలంలోని గుర్వాయిగూడెం గ్రామంలో కీసరి రాంబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. చిన్నగొల్లగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి, మధ్యాహ్న భోజన నాణ్యతపై వాకబు చేశారు. నల్లగుంట గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కొర్సా బోడప్ప మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అత్తులూరి వెంకటరామారావు, మండల యూత్ ప్రెసిడెంట్ సాయిల నర్సీ, కక్కిరాల రమేశ్, పగడాల రాంబాబు, చామర్తి గోపి శాస్త్రి, రొయ్యల కుమార్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, అన్నపురెడ్డిపల్లికి చెందిన కాళ్లూరి రుక్మాధర్ దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నాగళ్ల దుర్గాప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ బోడా పద్మ, పర్సా వెంకటేశ్వర్లు, వనమా గాంధీ, గాలం రాంబాబు, చల్లా పుల్లయ్య పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించారు. మృతుల కుటుంబాలు, అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించారు. క్రీడా పోటీలను ప్రారంభించారు. బత్తుల అంజి, పేటేటి నర్సింహారావు, తాండ్ర ప్రభాకర్‌రావు, తాటి తులసి, సున్నం సుధాకర్, కీసరి శ్రీను, పాలకుర్తి రత్నభూషణం, సురభి రాజేశ్, పాలకుర్తి రవి, గాడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లతో ప్రమాదాల నివారణ



అశ్వాపురం: ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న ఎస్ఐ సురేశ్



చండ్రుగొండ: ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు వేయిస్తున్న సీఐ శ్రీనివాసరావు

రేడియం స్టిక్కర్లతో ప్రమాదాలు నివారించవచ్చని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాల యజమానులకు ప్రమాదాల నివారణపై పోలీసులు అవగాహన కల్పించారు. అనంతరం ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ట్రాక్టర్ యజమానులంతా ట్రాక్టర్ల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: అశ్వాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

చండ్రుగొండ: చండ్రుగొండలో నిర్వహించిన కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మాచినేని రవి, సిబ్బంది పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి..



మాట్లాడుతున్న ఏఆర్‌ఓ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని మణుగూరు తహసీల్దార్, ఏఆర్‌ఓ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్‌ఓ మాట్లాడుతూ.. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్ విడుదల చేశారని, ఫిబ్రవరి 6వ తేదీ వరకు పట్టభద్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫారం –18 ద్వారా పట్టభద్రులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, మార్చి 29 వరకు అభ్యంతరాలను పరిష్కరించి ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. ఓటు నమోదు కోసం 2023, నవంబర్ 1కి కనీసం మూడేళ్ల ముందు గ్రాడ్యుయేషన్, తత్సమాన అర్హత పూర్తి చేసి ఉండాలని, కొత్త పట్టభద్రులతో పాటు గతంలో నమోదు చేసుకున్న పట్టభద్రులు సైతం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నమోదుకు దరఖాస్తుతో పాటు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం జిరాక్స్, ఫొటో, గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించి, ఓటర్ కార్డ్ జిరాక్స్‌లను జతచేయాలని సూచించారు.

సభ్యత్వ నమోదును పూర్తిచేయాలి



మాట్లాడుతున్న యార్లగడ్డ భాస్కరరావు

దమ్మపేట: సీపీఐ సభ్యత్వ నమోదు ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని ఆ పార్టీ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు సూచించారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, ధర్మా, బత్తుల సాయి, జాన్‌బీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో విద్యార్థుల సందడి



కిన్నెరసాని వద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు

గుండాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి పిక్నిక్‌కు వెళ్లారు. అక్కడి డీర్ పార్కు, మ్యూజియంను సందర్శించారు. నీటిలో బోటింగ్ చేసి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, మంజుల, రాజ్యలక్ష్మి, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ నాగార్జున, నరేశ్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ



నర్సింహారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దార్లగూడెం పంచాయతీ ఉప సర్పంచ్ కొర్సా నరసింహారావును భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం పరామర్శించారు. నరసింహారావు కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది కోలుకున్నాడు. ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, రావులపల్లి రాంప్రసాద్, సోముల రామిరెడ్డి, ఆకోజు సునీల్, ఖాదర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మోరంపల్లిబంజరలో ముగ్గుల పోటీలు



బూర్గంపాడు: బహుమతి అందిస్తున్న ఎంపీడీఓ



భద్రాచలంటౌన్: ముగ్గు వేస్తున్న యువతులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను బుధవారం వేడుకగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీడీఓ వివేక్‌రామ్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల్లో సంక్రాంతి ముగ్గులు కూడా భాగమని, స్నేహపూర్వక వాతావరణంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. 60 మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన చాపల మడుగు పున్నమ్మకు డ్రెస్సింగ్ టేబుల్, రెండో బహుమతి సాధించిన పి.రమణకు మిక్సీని అందించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి భవానీ, శెనగ మల్లేశ్వరరావు, కైపు సుబ్బరామిరెడ్డి, తాతిరెడ్డి వెంకటరెడ్డి, శనగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 30 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి శ్వేత, ద్వితీయ బహుమతి దివ్య, తృతీయ బహుమతి వర్షిత గెలుచుకున్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

గుండాల: గ్రామాల్లోకి మావోయిస్టులు వచ్చినా, అనుమానిత వ్యక్తుల కదలికలు ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలే తప్ప వారికి సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ హెచ్చరించారు. మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్లను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అంటించగా ఆయన మాట్లాడారు. మావోల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సిబ్బంది రాంబాబు, మంగీలాల్ పాల్గొన్నారు.

సమాచారమిచ్చి బహుమతి పొందండి

మణుగూరురూరల్: మావోయిస్టుల సమాచారాన్ని అందించి బహుమతులు పొందాలని మణుగూరు సీఐ రమాకాంత్, ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పలు ప్రాంతాల్లో సమాచారం మాకు – బహుమతి మీకు అంటూ ముద్రించిన మావోయిస్టుల చిత్రాలతో కూడిన పోస్టర్లను ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంతాల్లోని అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకుని ప్రలోభాలకు గురిచేసి, ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.



కరకగూడెం: వాల్‌పోస్టర్లు అంటిస్తున్న పోలీసులు

కరకగూడెంలో..

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల కూడళ్ల వద్ద ఎస్ఐ రాజారాం ఆధ్వర్యంలో బుధవారం మావోయిస్టు యాక్షన్ బృందం సభ్యుల పోస్టర్లను అంటించారు.

డేటా ఎంట్రీని వేగవంతం చేయండి



ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ శిరీష

చండ్రుగొండ: ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కొత్తగూడెం ఆర్డీఓ శిరీష అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. మండలంలోని మొత్తం 14 పంచాయతీల నుంచి 10 వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 10 పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తుల ఎంటీ పనులు పూర్తిచేశామని తహసీల్దార్ సాదియాసుల్తానా, ఎంపీడీఓ రేవతి తదితరులు తెలిపారు.

వితంతువులు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

చర్ల: మండలంలోని సరిహద్దు అటవీ ప్రాంత గ్రామమైన కుర్నపల్లిలో జీఎస్ఎస్ గ్రేస్ మిషన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది వితంతువులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొసైటీ చర్ల ఏరియా ప్రతినిధి సాలోమోన్, సంఘం కాపరి పాస్టర్ జాన్ విక్టర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు